క్లుప్తంగా

రేణుక యల్లమ్మ గుడిలో అన్నసమారాధన




అన్నప్రసాదం వడ్డిస్తున్న అల్లిపిల్లి అప్పారావు

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అల్లిపిల్లి అప్పారావు, రాజామణి దంపతుల సహకారంతో నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ముందుగా అమ్మవారికి అప్పారావు, రాజామణి దంపతులు పూజలు చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'పర్సంటేజీల కోసమే స్టాండింగ్ కమిటీ'

అల్లిపురం : జీవీఎంసీ స్టాండింగ్ కమిటీలు పర్సంటేజీల కోసమే పని చేస్తున్నాయని టీడీపీ, జనసేన కార్పొరేటర్లు ఆరోపించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ ఛాంబర్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్ మాట్లాడుతూ జీవీఎంసీ పాలకవర్గం మాఫియా గ్యాంగ్ అని మండిపడ్డారు. స్పోర్ట్స్ డైరెక్టర్ ఏడీసీ శ్రీనివాస్ కుంభకోణాలు చేయడం రివాజుగా మారిందన్నారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ వేసవి శిబిరాల కోసం ఏకంగా రూ.1.46 కోట్లు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అంధకారంలో గొల్లవీధి



చీకట్లో వేంకటేశ్వరమెట్ట గొల్లవీధి

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు గొల్లవీధి గత మూడు రోజులుగా అంధకారంలో కూరుకుపోయింది. వీధి దీపాలు వెలగక చీకటి అలుముకుంది. దీంతో ఈ ప్రాంతంలో దొంగతనాలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలో నిలిపిన ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోలు దొంగిలిస్తున్నారని, వాహనాల టైర్లు విప్పి పట్టుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

'ఓపెన్ హౌస్'పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ స్టూడెంట్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మ్యాప్‌ప్యాక్‌లు ఉపయోగించే తీరు, అత్యవసర సమయంలో పోలీసులు స్పందించే తీరు, కేసుల నమోదు, రిసెప్షన్ తీసుకున్న నిర్ణయాలు, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మాట్లాడే విధానం, ఆయుధాలు ఎప్పుడు ఉపయోగించాలనే విషయాలను తెలియజేశారు. స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీల విధివిధానాలపై వివరించారు. ప్రతి ఒక్క విషయాన్ని విద్యార్థులు ఆసక్తిగా ఆలకించారు. వారితో సీఐ విజయకుమార్ కాసేపు ముచ్చటించారు.

ప్రజల చెంతకే వైద్యసేవలు

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు చక్కటి స్పందన
- పరీక్షలు చేసి.. మందులు అందించిన వైద్యులు



ప్రసాద్‌గార్డెన్స్ శిబిరంలో రోగికి చికిత్స చేస్తున్న డాక్టర్ సందేష్



ప్రసాద్‌గార్డెన్స్‌లో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గురువారం జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు పెద్ద కొడుకుగా జగనన్న ఉన్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. వైద్య సిబ్బంది పేదల చెంతకెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసి సేవలందిస్తున్నారని అన్నారు. క్యాన్సర్ వంటి వ్యాధులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. గురువారం నాటి శిబిరానికి 516 మంది విచ్చేసారు. వీరిలో 147 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 35 మందిని కంటి శస్త్ర చికిత్సలకు తరలించారు. వీరిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సకు నలుగురు ఎంపికయ్యారు.

పేదలకు పలకరింపు..

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రోగులను పలకరించారు. వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్‌గార్డెన్స్‌లో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రమణమ్మ అనే మహిళ ఆరోగ్యంపై వైద్యాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన వంతు సహాయం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సందేష్, వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, సిటీ సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, నాయిని మల్లిబాబు, మంగరాజు, ఎస్సీ ఎల్ ప్రెసిడెంట్ బోని దేవా, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, గృహసారథులు, కన్వీనర్లు, ఏఎన్ఎంలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

28వ వార్డు గొల్లలపాలెంలో..

అల్లిపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జీవీఎంసీ 28వ వార్డు గొల్లలపాలెం-1 సచివాలయం పరిధిలో గల భీమ్‌నగర్, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 480 మంది పరీక్షలు నిర్వహించుకున్నారు. వారిలో 8 మందికి హృద్రోగ సమస్యలుండటంతో వారిని కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఏడుగురిని కంటి వైద్యం, గైనకాలజీ, డెర్మటాలజీ విభాగాలకు, మరింత మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు ఒకరిని పంపించారు. మిగిలిన వారికి ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, గైనకాలజీ వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. టీబీపై ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.



భీమ్‌నగర్ శిబిరంలో పాల్గొన్న బాపు ఆనంద్ తదితరులు

పోషకాహారంపై అవగాహన..

గర్భిణులు, బాలింతలు, మహిళలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాలు, రాగిపిండి, పాలు వాటి ప్రయోజనాలను వివరించారు. ప్రతి రోజు ఒక గుడ్డు తీసుకోవాలని, మునగాకు, తోటకూర, బచ్చలి కూర వంటివి తరచూ తీసుకోవడం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గొల్లలపాలెం-1 సచివాలయం పరిధిలో గల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయం, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అలాగే 31వ వార్డు శిబిరంలో మండల అధ్యక్షుడు బాపు ఆనంద్, కన్వీనర్ మోహన్ కల్యాణ్ పాల్గొని శిబిరాన్ని పర్యవేక్షించారు.

30వ వార్డులో..

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. స్థానిక కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం పాల్గొని మందులు, పౌష్టికాహారం స్టాల్‌ను సందర్శించారు. అనంతరం వృద్ధులు, మహిళలకు సూచనలు చేసి, వారిని ఆప్యాయంగా పలుకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల చిన్ని, సూర్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ అప్పలరత్నం వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



భీమ్‌నగర్ పీహెచ్‌సీలో వైద్యం అందజేస్తున్న వైద్యాధికారి నర్మద



భీమ్‌నగర్‌లో టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఆ విభాగం సిబ్బంది



భీమ్‌నగర్ వైద్య శిబిరంలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ అప్పలరత్నం

ఎమ్మెల్యే వాసుపల్లికి సత్కారం



ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరిస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారులు

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కేజీహెచ్ దరి ఫుట్‌పాత్ వ్యాపారులు ఘనంగా సత్కరించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ శత జయంతి ఉత్సవాలు, క్లినికల్, బయోమెట్రిక్ రీసెర్చ్ సెంటర్ శంకుస్థాపనకు ఉప రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్, హెల్త్ మినిస్టర్ రానున్న సందర్భంగా కేజీహెచ్ గోడను ఆనుకుని ఉన్న చిన్న చిన్న దుకాణాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో వారు ఎమ్మెల్యే వాసుపల్లిని కలిసి వేడుకోగా వారి కోసం అధికారులతో మాట్లాడి శత జయంతి ఉత్సవాలు జరిగే మూడు రోజులు మాత్రం దుకాణాలు తెరవరాదని హామీ ఇవ్వడంతో ఫుట్‌పాత్ దుకాణదారులు గురువారం ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ మండల అధ్యక్షుడు పీతల వాసు, క్లస్టర్ ఇన్‌చార్జి కోన శంకర్, మాజీ కార్పొరేటర్ బుద్దల అనురాధ, హాకర్స్ ప్రెసిడెంట్ రాజు, ఎర్రబిల్లి ప్రభాకర్, బోణి దేవ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజేయూ నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీజేయూ) నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా బాల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బులుసు సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శిగా ఎం.భరత్ కుమార్, కోశాధికారిగా వి.గణేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పీఎల్‌కె మూర్తి, పీవీఎస్ఎన్ ప్రసాద్, ఎల్.ఈశ్వరరావు, బి.శ్రీనివాసులు, ఎన్వీ అప్పారావు తదితరులు ఎన్నికయ్యారు.

ఘనంగా ధర్మప్రచార వారోత్సవాలు



ఎరుకుమాంబ ఆలయంలో భజనలు చేస్తున్న సాయిరాజ్ తదితరులు



శ్రీ జగన్నాథస్వామి దేవాలయంలో భజనలు, పారాయణలో పాల్గొన్న కళాకారులు, భక్తులు



దుర్గాలమ్మ ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలలో పాల్గొన్న భాస్కరరావు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం ధర్మప్రచార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయిరాజు భక్తి రంజని ప్రతినిధుల భజనలు ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జి.వి.రమాబాయి, భక్తులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో..

అల్లిపురం : టౌన్ కొత్తరోడ్డు శ్రీ జగన్నాథస్వామి దేవాలయంలో ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా గురువారం ఐదవరోజు కార్యక్రమంలో భాగంగా శ్రీ ఎంబర్‌మన్నార్ భజన మండలి సభ్యులచే నిర్వహించిన భజనలు, పారాయణలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా మహాలక్ష్మీదేవి అమ్మవారికి ఉదయం నుంచి విశేష సువర్ణ పుష్పార్చన, గజలక్ష్మీ అమ్మవారికి కవచధారణ ప్రత్యేకంగా చేపట్టారు. అనంతరం ఆకొండ వెంకట్రావు మాస్టారి కర్ణాటక పురందరదాసుల కీర్తనల భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు..

జగదాంబ : ధర్మ పరిరక్షణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దేవస్థానాల్లో ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తుందని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. వార్డులోని పూర్ణామార్కెట్ జంక్షన్‌లో గల దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం జరిగిన నృత్య ప్రదర్శనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల ద్వారా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. అనంతరం లలిత సంగీతం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, దేవస్థానం ఈవో శేఖర్‌బాబు, చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కాండ్రేగుల రూపవతి, యాళ్ల రమణమ్మ, పిల్లి వెంకటరమణ, అర్చక ధర్మకర్త రాంబాబు, 35వ వార్డు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి వేడుకగా సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్ర నవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ.. : కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

8న విద్యా సంస్థల బంద్



వివరాలు వెల్లడిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

అల్లిపురం : విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థలు బంద్ ప్రకటించినట్లు ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఉల్లం నాగరాజు, కార్యదర్శి వై. రాంబాబు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నవంబర్ 8వ తేదీకి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బందులో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అచ్యుతరావు, పీడీఎస్ఎఫ్ జిల్లా నాయకురాలు అభిశ్రీ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రతన్‌కాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శేఖర్, జీవన్, మనీ, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

దాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి బురుజుపేటకు చెందిన ఆర్.మెహతాజీ గురువారం రూ.లక్ష విరాళాన్ని ఏఈవో కె.తిరుమలేశ్వరరావుకు అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు ఏఈవో ప్రసాదం అందజేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని, రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, పదో తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో, 83090 03957లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు విస్తరణకు స్థల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి నుంచి అక్కయ్యపాలెం వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దొండపర్తి కుప్పిలివారివీధి, అల్లూరివారి వీధి, మండావారి వీధుల్లో స్థానికులతో జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారి అనిల్, జోన్-3 ఏసీపీలు రఘునాథ్, రామకృష్ణ, టీపీవో విజయకుమార్ సచివాలయ సిబ్బందితో కలిసి చర్చలు జరిపారు. వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు ద్వారా సంబంధిత గృహ యజమానులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ డిజైన్ మార్చి ఐదు నుంచి 13 అడుగుల వరకు విస్తరణ పనులు చేపడితే తమకు ఇబ్బందులు తప్పవన్నారు. అంతా వంద గజాలలోపు ఉన్నవారే అని తెలిపారు. ఇక్కడ కొన్ని ఆస్తులకు వారసులు మాత్రం పది మంది వరకు ఉండటంతో నేటికీ ఆస్తుల పంపకాలు జరగలేదని స్థానికులు అధికారులకు వివరించారు. వంద అడుగుల జీవీఎంసీ స్థలం ఉండగా ప్రైవేట్ స్థల యాజమానులను ఇబ్బంది పెట్టడం సరి కాదన్నారు. దీంతో అధికారులు దేవస్థానం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు స్థానికులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టిలో ఈ విషయం పెట్టి యాజమానులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. త్వరలో నోటీసుల ద్వారా విషయం తెలియజేస్తామని, అప్పుడు ఉన్నతాధికారులకు స్పందన తెలపాలని స్థానికులకు అధికారులకు తెలిపారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



అప్పన్న నిత్య కల్యాణాన్ని తిలకిస్తున్న ఉభయదాతలు

సింహాచలం: సింహగిరి శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. పూజలలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంయింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం జరిపించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం

మద్దిలపాలెం: ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి అన్నారు. డోరు డెలివరీ మాసోత్సవాలను గురువారం ఆమె డిపో ఆవరణలో కౌంటర్ వద్ద పోస్టర్ ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సేవలను నగరంలో 10 కిలోమీటర్ల మేరకు అందిస్తామన్నారు. గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలలో పార్సిళ్లు బుక్ చేసుకోవచ్చనన్నారు. కార్యక్రమంలో ఏటీఎం జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు

ఏయూ క్యాంపస్: జిల్లా యోగా అసోసియేషన్, ఏయూ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు-2023 జరగనున్నాయి. ఈ మేరకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం ఆంధ్రా యూనివర్సిటీ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎ.రాజు, కార్యదర్శి సిహెచ్.వెంకటరమేష్, కోశాధికారి జి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీని కలిసిన జిల్లా కాంగ్రెస్ నాయకులు



కేవీపీ రామచంద్రరావును సత్కరిస్తున్న గోవిందరాజు తదితరులు

అల్లిపురం : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు గురువారం నగరానికి విచ్చేశారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంపా గోవిందరాజు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. ఇందులో భాగంగా జిల్లా ఉపాధ్యక్షుడు కాకినాడ చినబాబు, నగర మహిళా అధ్యక్షురాలు కూచి లక్ష్మి, వేడి వెంకటేష్, రామారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సూర్యనారాయణ, అర్షద్ బాషా, అప్పారావు, సీతారాం, దేవా, ఆషా కేవీపీని సత్కరించారు.